క్లుప్తంగా

వైభవంగా సుంకులమ్మదేవి విగ్రహ ప్రతిష్ట



ఆలయంలో అమ్మవారిని దర్శించుకున్న ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి

వజ్రకరూరు: మండలంలోని చిన్నహోతురులో నిర్మించిన సుంకులమ్మ ఆలయంలో గురువారం అమ్మవారి విగ్రహ ప్రతిష్ట మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ ఉదయం ఆలయంలో యంత్ర ప్ర తిష్ట, విగ్రహ ప్రతిష్ట, ప్రాతకాలపూజ, చండీహోమం, కలశప్రతిష్ట, బలి పూర్ణాహుతి, అమ్మవారి దర్శనం, మంగళహారతి, తీర్థప్రసాద వినియోగం, విశేషపూజలు చేపట్టారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. స్థానికులు, భక్తులు పెద్దసంఖ్యలో ఆలయానికి చేరుకుని అమ్మవారిని దర్శించుకున్నారు. ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే, నియోజవర్గ సమన్వకర్త వై.విశ్వేశ్వరరెడ్డి గ్రామానికి చేరుకుని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఘనంగా దేవమ్మదేవి విగ్రహ ప్రతిష్ట



పూజలు నిర్వహిస్తున్న గ్రామస్తులు

విడపనకల్లు: మండలంలోని పాల్తూరు గ్రామంలో గురువారం దేవమ్మదేవి విగ్రహ ప్రతిష్ట ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో వేద పండితుల ఆధ్వర్యంలో హోమం, పూజలు చేపట్టారు. గ్రామంలోని మహిళలు పెద్ద ఎత్తున దేవమ్మదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించారు.

రేపు కార్తీక దీపోత్సవం

రాయదుర్గం రూరల్: మండలంలోని వద్రహొన్నూరు సమీపంలోని అపులాపురం ఆంజనేయ స్వామి ఆలయంలో కార్తీక మాసం చివరి శనివారం (9వ తేదీ) ధ్వజస్తంభంపై కార్తీక దీపోత్సవం, శివలింగానికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయకమిటీ సభ్యులు తెలిపారు. అలాగే రెడ్ క్రాస్ సొసైటీ సహకారంతో మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశామన్నారు. రక్తదానం చేయదలచిన వారు 78930 24634 , 9346712147, 9000444736 నంబర్లకు ఫోన్ చేసి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

వైభవంగా కలశ ప్రతిష్ట



శిఖర ప్రతిష్ట నిర్వహించిన దృశ్యం

ఉరవకొండ: స్థానిక పాతపేటలో ఉన్న నంజుడేశ్వర స్వామి ఆలయంలో ఆదిత్యాది నవగ్రహ, గోపుర శిఖర కలశ ప్రతిష్ట కార్యక్రమాలు గురువారం వైభవంగా నిర్వహించారు. ఉదయం బ్రహ్మ ముహూర్తాన యంత్ర ప్రతిష్ట, విగ్రహ ప్రతిష్ట, హోమాలు, పూర్ణాహుతి, మహామంగళహారతి కార్యక్రమాలు చేపట్టారు. నవగ్రహ విగ్రహ దాతలు పచ్చి వరలక్ష్మి, పచ్చి హరిదాసు, గోపుర కలశ దాత నామా విశ్వనాథ శెట్టి, శివలింగ కవచం శివరాంపేట వెంటకరమణప్ప, అభివృద్ధి కమిటీ సభ్యులు నాగరాజు శెట్టి, అన్నదాత శిరుగుప్ప వనజాక్షి, లక్ష్మీనారాయణ, భక్తులు పాల్గొన్నారు.

ఫార్మసిస్టుకు తప్పిన ప్రమాదం



సిబ్బంది చంపిన నాగుపాము ఇదే..

కూడేరు: మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో గురువారం ఫార్మసిస్టు వేణుగోపాల్‌కు పాము కాటు ప్రమాదం తప్పింది. ఆయన మందుల బాక్సులను సర్దుతుండగా కాలు పక్కనే నాగు పాము వచ్చి ఆగింది. సిబ్బంది గమనించి అతడిని అప్రమత్తం చేశారు. భయంతో ఆయన నెమ్మదిగా పక్కకు వచ్చేశాడు. అదే సమయంలో మందుల బాక్సు తోకపై పడడంతో పాము ముందుకు వెళ్లలేకపోయింది. వెంటనే సిబ్బంది పామును చంపేశారు. పాముల సంచారంతో సిబ్బంది, వైద్యం కోసం వచ్చే ప్రజలు భయాందోళన చెందుతున్నారు. పీహెచ్‌సీ ముందు ఉన్న పిచ్చి మొక్కలను , గడ్డిని తొలగించి పాముల బెడద లేకుండా చూడాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ఈవీఎంలపై అవగాహన

గుమ్మఘట్ట: ఎన్నికలలో వినియోగించే ఈవీఎంలపై ఓటర్లకు విస్తత స్థాయిలో అవగాహన కల్పించి, చైతన్యం తీసుకువస్తున్నట్లు తహసీల్దార్ బ్రహ్మయ్య గురువారం తెలిపారు. ఈవీఎంలపై ప్రజలకు ఉన్న అపోహలను తొలగించేందుకు ఎన్నికల సంఘం ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఆయన తెలిపారు.

శరవేగంగా ఇళ్ల నిర్మాణం

- ఆదర్శంగా రూపుదిద్దుకుంటున్న జగనన్న కాలనీలు
- వాస్తవాలు తెలుసుకోకనే టీడీపీ ఆరోపణలు

మున్సిపాలిటీ పరిధిలో	
మొత్తం లే అవుట్లు	4
మొత్తం ఇంటి స్థలాలు	2523
మొత్తం ఇళ్ల మంజూరు	2420
బేస్‌మట్టం స్థాయిలో	1010
పూర్తయినవి	698
ఆప్షన్ -3లో ఉన్న ఇళ్లు	750
విడుదలైన నిధులు	రూ.43.56 కోట్లు



గూబనపల్లి లే అవుట్‌లో నిర్మితమవుతున్న ఇళ్లు



పూర్తయిన ఇళ్ల నిర్మాణాలు

కళ్యాణదుర్గం: నవరత్నాలు– పేదలందరికీ ఇళ్లు కార్యక్రమంలో భాగంగా కళ్యాణదుర్గం మున్సిపాలిటీలో పక్కా ఇళ్ల నిర్మాణం శర వేగంగా కొనసాగుతోంది. నిరుపేదలకు ప్రభుత్వమే స్థలం కేటాయించి ఇళ్లను నిర్మిస్తోంది. వీటి నిర్మాణం పూర్తయితే గతంలో కూలి పనులు చేసుకుంటూ బాడుగ ఇళ్లలో బతుకీడుస్తున్న ఎంతో మంది నిర్భాగ్యులకు జగనన్న కాలనీలలో శాశ్వత గూడు దొరుకుతుంది. అర్హతే ప్రామాణికంగా సచివాలయం ద్వారా దరఖాస్తు చేసుకున్న అర్హుల సొంతింటి కలను వైఎస్సార్‌సీపీ నెరవేరుస్తోంది. నాణ్యతలో రాజీపడకుండా, ఎలాంటి కమిషన్లకు తావులేకుండా పూర్తి పారదర్శకతతో నిర్మిస్తున్న ఇళ్లపై లబ్ధిదారులు ఆసక్తి చూపుతున్నారు.

ఆదర్శంగా జగనన్న కాలనీలు

జగనన్న లే అవుట్లలో నిర్మిస్తున్న ఇళ్లకు ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన అన్ని మౌలిక వసతులను ఏర్పాటు చేసింది. ఇప్పటికే కురాకుల తోట, ముదిగల్లు1,2, గూబనపల్లి లే అవుట్‌లలో లబ్ధిదారులకు అవసరమైన విద్యుత్ సరఫరా, నీటి ట్యాంకుల ఏర్పాటు కల్పించింది. ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేస్తుండటంతో లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా హౌసింగ్, మున్సిపల్ అధికారుల సమన్వయంతో పర్యవేక్షణ జరుగుతోంది. ఎక్కడా ఏ ప్రభుత్వం చేయని విధంగా జగనన్న కాలనీలు ఆదర్శంగా రూపుదిద్దుకుంటున్నాయి.

వాస్తవాలు తెలుసుకోకనే టీడీపీ ఆరోపణలు

జగనన్న కాలనీలలో జరుగుతున్న అభివృద్ధి పనులు ఓర్వలేక టీడీపీ నేతలు ఆరోపణలు చేయడం పరిపాటిగా మారింది. ఆయా కాలనీలలో జరుగుతున్న అభివృద్ధి పనుల వాస్తవాలు తెలుసుకోకనే అనర్హులకు అన్యాయం జరుగుతుందంటూ గగ్గోలు పెడుతోంది. నాసిరకం పనులతో పనులు చేస్తున్నారంటూ అసత్య ఆరోపణలు చేస్తూ ప్రజలను మభ్య పెట్టేందుకు యత్నించడంపై పలువురు లబ్ధిదారులే టీడీపీ తీరుపై మండిపడుతున్నారు. ఆర్తా వెంచర్స్ ప్రతినిధి ప్రమోదు మాట్లాడుతూ ప్రభుత్వం జగనన్న కాలనీల్లో పేదలకు నిర్మిస్తున్న పక్కా ఇళ్ల నిర్మాణాల నాణ్యతలో రాజీపడబోమన్నారు. నిర్మాణాలను త్వరతగతిన పూర్తి చేసి లబ్ధిదారులకు ఇంటిని అందజేస్తామన్నారు.

త్వరలో రెండో విడత గృహ ప్రవేశాలు



జగనన్న కాలనీల్లో పక్కా ఇళ్ల నిర్మాణాలు పూర్తి పారదర్శకతతో జరుగుతున్నాయి. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను అధిగమించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే ఆయా లే అవుట్లలో 698 ఇళ్లకు పైగా పూర్తయ్యాయి. మిగిలినవి వివిధ స్థాయిల్లో ఉన్నాయి. త్వరలోనే రెండో విడత సామూహిక గృహ ప్రవేశాలు చేపట్టనున్నాం.

– రామ్మోహన్, ఏఈ అర్బన్ హౌసింగ్

నేడు మంత్రి పర్యటన

కళ్యాణదుర్గం: రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి కేవీ ఉషశ్రీచరణ్ కళ్యాణదుర్గం మండలంలోని ముద్దినాయనపల్లిలో శుక్రవారం పర్యటించనున్నారు. ఈ మేరకు గురువారం మంత్రి క్యాంపు కార్యాలయం నుంచి ఓ ప్రకటన విడుదలైంది. ఉదయం 10.30 గంటలకు గ్రామంలో నూతనంగా నిర్మించనున్న 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రానికి మంత్రి భూమిపూజ చేయనున్నారు. ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

నేడు మెగా వైద్య శిబిరం

రాయదుర్గం: పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో శుక్రవారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు స్పెషలిస్ట్ వైద్యురాలు స్రవంతి నివేదితరెడ్డి గురువారం తెలిపారు. ప్రజా సంక్షేమం దృష్ట్యా ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి, భారతి విజ్ఞప్తి మేరకు వైద్య శిబిరం ఏర్పాటు చేశామన్నారు. శిబిరంలో షుగర్, బీపీ, థైరాయిడ్, విష జ్వరాలు, కిడ్నీ, జనరల్, నోరు, ముఖము, దవడ, తలనొప్పి, ఫిట్స్ తదితర జబ్బులకు ఉచితంగా వైద్యచికిత్సలు అందిస్తామన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

శుభకార్యం

బొమ్మనహాళ్: మండలంలోని రామసారం గ్రామంలో గురువారం వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు నారాయణప్ప కుమారుడు ఓబన్న- వందన వివాహంలో మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి పాల్గొన్నారు. పార్టీ రాష్ట్ర నాయకుడు త్రిలోక్‌రెడ్డి, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు వీరన్నతో కలసి ఆయన వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో సర్పంచ్ రామకృష్ణమ్మ, ఎంపీటీసీ వీరబొమ్మన్న తదితరులు పాల్గొన్నారు.

15 నుంచి 'ఆడుదాం ఆంధ్రా'

రాయదుర్గంటౌన్: గ్రామ, వార్డు స్థాయి నుంచి క్రీడాకారులను భాగస్వామ్యం చేసేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 15 నుంచి రాయదుర్గంలో క్రికెట్, కోకో, కబడ్డీ, బ్యాడ్మింటన్(షటిల్), వాలీబాల్ క్రీడల్లో పోటీలు నిర్వహిస్తామన్నారు. ఆసక్తి గల ఆటగాళ్ల పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు ఈ నెల 13 వరకూ ప్రక్రియ కొనసాగుతుందన్నారు. సచివాలయాలు మొదలు రాష్ట్రస్థాయి వరకు ఐదు దశల్లో పోటీలు జరుగుతాయన్నారు. ఇప్పటి వరకూ రాయదుర్గం పట్టణ పరిదిలో 2100 మంది క్రీడాకారులు పేర్లను నమోదు చేసుకున్నారన్నారు.



కూడేరు:ఆడుదాం ఆంధ్ర కిట్లను అందజేస్తున్న ఎంపీపీ నారాయణరెడ్డి

కూడేరు: క్రీడాకారులను ప్రోత్సహించేందుకే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలకు శ్రీకారం చుట్టారని ఎంపీపీ నారాయణరెడ్డి అన్నారు. మండలానికి సరఫరా అయిన క్రీడా కిట్లను గురువారం కూడేరులోని సచివాలయంలో మండలంలోని సచివాలయ సిబ్బందికి ఎంపీపీ పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ క్రికెట్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ క్రీడల్లో నియోజక వర్గ స్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ విజేతలుగా నిలిస్తే రూ.35 వేలు, రూ.15 వేలు, రూ.5 వేల చొప్పున నగదు బహుమతులను అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కార్యాలయ ఏఓ నాగభూషణరెడ్డి, ఎంఈఓ చంద్రశేఖర్, ఏఓ విజయ కుమార్, పీడీ అక్కులప్ప, వైఎస్సార్‌సీపీ మండ కన్వీనర్ రామచంద్రారెడ్డి, నాయకులు గంగాధర్, రామాంజనేయులు, ఎర్రనాగప్ప, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలి

రాయదుర్గంటౌన్: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మికత అలవర్చుకోవాలని కొనకొండ్ల గురునాథస్వామిజీ అన్నారు. గురువారం పట్టణంలోని మొలకాల్మూరు రోడ్డు గాంధీ నగర్ కాలనీలో సద్గురు గుడికల్ అల్లీపీరాస్వాముల ఆరాధన మహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన సత్సంగం, ఉపన్యాస కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమానికి ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్‌పర్సన్ కాపు భారతితోపాటు మున్సిపల్ వైస్ చైర్మన్ శ్రీనివాసయాదవ్, పట్టణ కన్వీనర్ అరవా శివప్ప, కౌన్సిలర్లు పొరాళ్ల గోవిందరాజులు, డిష్ గోవిందు, పెద్ద వన్నూరుస్వామి, ఫక్రుద్దీన్, మంజునాథ హాజరై స్వామిజీ ఆశీర్వాదం పొందారు.



గురునాథస్వామిజీ ఆశీర్వాదం తీసుకుంటున్న కాపు భారతి, కౌన్సిలర్లు

తూనికలు, కొలతల ఇన్‌స్పెక్టర్ తనిఖీలు



వెయింగ్ మిషన్‌ను పరిశీలిస్తున్న అధికారి శంకర్

కణేకల్లు: మండలంలోని వివిధ గ్రామాల్లో రైతుల నుంచి వరిధాన్యం కొనుగోలు చేస్తున్న ప్రాంతాల్లో గుంతకల్లు డివిజన్ తూనికలు, కొలతల ఇన్‌స్పెక్టర్ శంకర్ గురువారం విస్తృత తనిఖీలు నిర్వహించారు. మాల్యం, కణేకల్లు, గంగలాపురం తదితర గ్రామాల్లోని వరికల్లాల్లో వరిధాన్యం కొనుగోలు చేస్తున్న ప్రాంతాలకెళ్లి కాటాలను పరిశీలించారు. మాల్యం గ్రామశివారులో తూకాలు వేసే రాళ్లకు సీల్ వేయించుకోకుండా వినియోగిస్తుండటంతో వ్యాపారికి రూ.3 వేలు జరిమానా విధించారు. అలాగే ఓ రైస్‌మిల్లు నుంచి బియ్యం లోడ్‌తో వస్తున్న ఆటోను ఆపి తూకం వేయగా 48 కిలోలు మాత్రమే ఉండటంతో సదరు వ్యాపారికి రూ.40 వేలు జరిమానా విధించారు. కాగా తూనికలు, కొలతల ఇన్‌స్పెక్టర్ దాడులు నిర్వహిస్తున్నట్లు తెలుసుకున్న వ్యాపారులు వ్యాపారులకు బ్రేక్ వేశారు.

జెండర్ ఆధారిత హింసకు వ్యతిరేకంగా ర్యాలీ

బెళుగుప్ప: జెండర్ ఆధారిత హింసకు వ్యతిరేకంగా బెళుగుప్ప ఉన్నత పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలసి డీఆర్‌డీఏ అధికారులు, మహిళా సంఘాల సభ్యులు గురువారం ర్యాలీ నిర్వహించారు. స్థానిక ఉన్నత పాఠశాల వద్ద మానవహారం ఏర్పాటు చేశారు. ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయుడు రఫీ, మండల రవితేజ మహిళా సమాఖ్య అధ్యక్షురాలు ఉషారాణి మాట్లాడుతూ లింగ వివక్ష తగదన్నారు. పురుషులతో సమానంగా మహిళలను గౌరవించాలన్నారు. కార్యక్రమంలో వైకేపీ మండల సమాఖ్య కార్యదర్శి సుజాత, డీఆర్‌డీఏ సీసీలు రామప్రభ, నారాయణప్ప, పీడీ రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఈ-క్రాప్ బుకింగ్ తప్పనిసరి

బొమ్మనహాళ్: మండలంలో రబీ సీజన్‌లో పంటలు సాగుచేసిన రైతులు తప్పనిసరిగా ఈ-క్రాప్ బుకింగ్ చేసుకోవాలని ఏఓ సాయికుమార్ గురువారం తెలిపారు. రైతు భరోసా కేంద్రాల్లో ఎంపీఈఓలు, విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లను సంప్రదించి రైతులు పంట నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు.

కేవీఎస్ పరీక్షలో 34వ ర్యాంకు



సజియా సహనారా

విడపనకల్లు: కేంద్రీయ విశ్వవిద్యాలయానికి సంబంధించిన పోటీ పరీక్షలో ఆల్ ఇండియా కేవీఎస్ పరీక్షల్లో సజియా సహనారా 34వ ర్యాంకు సాధించింది. మండలంలోని హావళిగి గ్రామానికి చెందిన శర్మస్‌వలి, ఫరిదాబేగం దంపతుల కుమార్తె సజియా సహనారా కేవీఎస్ ఉపాధ్యాయ పరీక్షలు రాసి రాష్ట్రంలో రెండో ర్యాంకు, దేశ వ్యాప్తంగా 34వ ర్యాంకు సాధించి గుత్తి ఆర్ఎస్‌లో ఉన్న పీఎం కేవీఎస్ పాఠశాలో ప్రైమరీ ఉపాధ్యాయురాలిగా బాధ్యతలు చేపట్టింది. ఈ సంర్బంగా పలువురు ఆమెను అభినందించారు.

బస్సు సౌకర్యం కల్పించాలని వినతి

కుందుర్పి: కళ్యాణదుర్గం ఆర్టీసీ డిపో నుంచి జంబుగుంపల పంచాయతీ గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించాలని కళ్యాణదుర్గం డిపో మేనేజర్ రామచంద్రకు పలువురు ప్రజాప్రతినిధులు గురువారం వినతి పత్రం అందజేశారు. కర్ణాటక సరిహద్దున ఉన్న జంబుగుంపల పంచాయతీలోని ఐదు గ్రామాల ప్రజలు బస్సు సౌకర్యం లేక ఇబ్బంది పడుతున్నారన్నారు. వినతిప్రతం అందించిన వారిలో వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ పాలాక్షి, ఎంపీపీ కమలమ్మ, సర్పంచ్ గంగాధర, మాజీ ఎంపీటీసీ సభ్యుడు తిప్పేస్వామి తదితరులున్నారు.

సీఐ సేవలు మరవలేనివి

కళ్యాణదుర్గం రూరల్: కళ్యాణదుర్గం రూరల్ సీఐ శ్రీనివాసులు సేవలు మరవలేనివి అని డీఎస్పీ శ్రీనివాసులు అన్నారు. ఇటీవల ఆయన బదిలీపై వెళ్లడంతో సర్కిల్ పరిధిలోని పోలీసు సిబ్బంది గురువారం రాత్రి వీడ్కోల్ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీతోపాటు సీఐలు నాగరాజు, యుంగధర్, మంత్రి ఉషశ్రీ చరణ్ వ్యక్తిగత కార్యదర్శి దేవదాస్ తదితరులు సీఐని సన్మానించారు. ఎస్ఐలు సుధాకర్, యువరాజ్, పరశురాయుడు, మార్కెట్ యార్డ్ మాజీ చైర్‌పర్సన్ బిక్కి నాగలక్ష్మి, నాయకులు బ్రహయ్య. రవి, వన్నూర్‌స్వామి, బద్దేనాయక్ పాల్గొన్నారు.

సబ్‌స్టేషన్‌లో పేలుళ్లు

కళ్యాణదుర్గం రూరల్: పట్టణంలోని 220 కేవీ సబ్‌స్టేషన్‌లో గురువారం రాత్రి భారీ శబ్దంతో పేలుళ్లు సంభవించాయి. అప్రమత్తమైన అధికారులు వెంటనే మొత్తం కరెంట్ సరఫరాను నిలిపివేశారు. అనంతరం విద్యుత్ పునరుద్ధణ చర్యలు చేపట్టారు.

దళిత ద్రోహి చంద్రబాబు



మాట్లాడుతున్న ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి బీటీపీ గోవిందు

రాయదుర్గం: దళిత ద్రోహి చంద్రబాబు అని వైఎస్సార్‌సీపీ ఎస్సీసెల్ రాష్ట్ర కార్యదర్శి బీటీపీ గోవిందు, కణేకల్లు, గుమ్మఘట్ట ఎంపీపీలు సంధ్య, భవాని మండిపడ్డారు. పట్టణంలోని రోడ్లు, భవనాల శాఖ అతిథి గృహం వద్ద ఐదు మండలాలకు చెందిన దళిత నాయకులతో కలసి వారు విలేకరుల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ సీఎంగా చంద్రబాబు, మంత్రిగా కాలవ శ్రీనివాసులు ఉన్నప్పుడు దళితుల సంక్షేమాన్ని ఎందుకు పట్టించుకోలేదని నిలదీశారు. ఎన్నికలు దగ్గరపడే కొద్దీ దళితులు గుర్తుకు రావడం శోచనీయమన్నారు. టీడీపీ హయంలో దళితులపై దాడులు, దౌర్జన్యాలు, మహిళలపై అఘాయిత్యాలు లెక్కలేనన్ని జరిగాయని విరుచుకుపడ్డారు. రాయదుర్గంలో కాలవ శ్రీనివాసులు దళితుల అమాయకత్వాన్ని ఆసరగా చేసుకుని మరో కొత్త ఎత్తుగడకు శ్రీకారం చుట్టారని ధ్వజమెత్తారు. గడిచిన నాలుగున్నరేళ్లలో ఏనాడు లేని విధంగా అంబేడ్కర్ వర్ధంతి పేరుతో ర్యాలీ చేపట్టడం హాస్యస్పదంగా ఉందన్నారు. తీరా ఆ మహనీయుని ముసుగులో ఎన్టీఆర్‌కు నివాళులర్పించడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. అవహేళన చేసిన కాలవకు తగిన గుణపాఠం చెపుతామని హెచ్చరించారు.

ఎంఎస్ రాజూ.. నోరు జాగ్రత్త

టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు కాలవ శ్రీనివాసులు సంక నాకేందుకు వచ్చిన దుర్మార్గుడు ఎంఎస్ రాజు అని ఎంపీపీలు, ఎస్సీసెల్ రాష్ట్ర కార్యదర్శితో పాటు దళిత సంఘం నాయకులు బేలోడు రామాంజనేయులు, గుమ్మఘట్ట కేఎం రాజు, చందన రామాంజి, కౌన్సిలర్ వన్నూరప్పఘాటుగా విమర్శించారు. కాలవ రాసిచ్చిన స్క్రిప్ట్ మేరకు సీఎం వైఎస్ జగన్, విప్ కాపు రామచంద్రారెడ్డిపై నోటికొచ్చినట్టు మాట్లాడుతావా అంటూ ధ్వజమెత్తారు. నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడకపోతే నాలుక కత్తిరిస్తామని హెచ్చరించారు. కులాల మధ్య కుంపట్లు సృష్టించి లబ్ధిపొందాలనుకోవడం కాలవకు వెన్నతో పెట్టిన విద్యగా మారిందన్నారు. దళితులంతా మేలు చేసే ప్రభుత్వం వెంటే నడుస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచులు గంగప్ప, వెంకటేశులు, దళిత నాయకులు మహేష్, ఉలిగప్ప, అమరేష్,. యల్లప్ప, కొలిమి ఆనంద్, చిన్న సిద్దప్ప, నియోజకవర్గంలోని ఐదు మండలాలకు చెందిన దళిత నాయకులు పాల్గొన్నారు.

హోరాహోరీగా ఎద్దులబండి లాగుడు పోటీలు

బొమ్మనహాళ్: మండలంలోని దర్గాహొన్నూరు స్వామి ఉరుసు ఉత్సవాల్లో భాగంగా గురువారం వైఎస్సార్‌సీపీ నాయకుల ఆధ్వర్యంలో ఎద్దులబండి లాగుడు పోటీలు నిర్వహించారు. హోరాహోరీగా సాగిన ఈ పోటీల్లో అదే గ్రామానికి చెందిన ఎనిమిది జతల ఎద్దులు పాల్గొన్నాయి. పదిహేను నిమిషాల వ్యవధిలో పూజారి లోకేష్ ఎద్దులు 5,290 అడుగులు బండిని లాగి మొదటి బహుమతి రూ.12 వేలు దక్కించుకున్నాయి. ఆర్.సురేంద్ర ఎద్దులు 5,290 అడుగులు లాగి ద్వితీయ బహుమతి రూ. 10 వేలు దక్కించుకున్నాయి. ఎ. లింగన్న ఎద్దులు 4,750 అడుగులు లాగి మూడో బహుమతి రూ.8 వేలు, ఆర్. వన్నూరుస్వామి ఎద్దులు 4,508 అడుగులు లాగి నాల్గవ బహుమతి రూ.6 వేలు దక్కించుకున్నాయి.



బహుమతులను ప్రదానం చేస్తున్న దృశ్యం

బహుమతులను వైఎస్సార్‌సీపీ నాయకులు అనిల్‌రెడ్డి, మనోహర్‌శెట్టి, వైస్ సర్పంచ్ నాగరాజు, జలేందర్ అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రామాంజనేయులు, నాయకులు రామకృష్ణ, ఆనంద్‌రెడ్డి, బండూరు వన్నూరుస్వామి, రాముడు,నాగరాజు, పోతప్ప తదితరులు పాల్గొన్నారు.

కుష్టువ్యాధిపై విద్యార్థులకు అవగాహన

కూడేరు: శరీరం పై స్పర్శలేని మచ్చలుంటే కుష్టు వ్యాధి కావొచ్చని సీహెచ్‌ఓ వరలక్ష్మి అన్నారు. గురువారం స్థానిక ప్రాథమిక పాఠశాలలో కుష్టు వ్యాధిపై వైద్యాధికారులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పిల్లలందరినీ పరీక్షించారు. కుష్టు వ్యాధిని ప్రాథమిక దశలోనే గుర్తించి చికిత్స పొందితే.. జబ్బు పూర్తిగా నయమవుతుందన్నారు. ఎవరికైన శరీరంపై స్పర్శలేని మచ్చలుంటే పీహెచ్‌సీకి వెళ్లి పరీక్షించుకొని వ్యాధి నిర్ధారణ చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ రవీంద్ర, ఏఎన్ఎం సుశీల, ఆశావర్కర్లు పాల్గొన్నారు.



పిల్లలను పరీక్షిస్తున్న సీహెచ్‌ఓ వరలక్ష్మి, సూపర్‌వైజర్ రవీంద్ర

సంక్షిప్త సమాచారం

దివ్యాంగులను గౌరవించాలి



మాట్లాడుతున్న ఎస్కే చారిటబుల్ ట్రస్టు నిర్వాహకుడు లెనిన్

కుందుర్పి: సకలాంగులతో సమానంగా దివ్యాంగులను గౌరవించాలని ఎస్కే చారిటబుల్ ట్రస్టు నిర్వాహకుడు లెనిన్ బాబు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, ఆర్డీటీ ఏటీఎల్ నారాయణస్వామి సూచించారు. గురువారం కుందుర్పిలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం నిర్వహించారు. స్థానిక రామస్వామి ఆలయం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకూ వందలాది మంది దివ్యాంగులు ర్యాలీ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వక్తలు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చట్టసభల్లోనూ, ఉద్యోగాల పరంగా దివ్యాంగులకు రిజర్వేషన్లు కల్పించి తోడ్పాటునివ్వాలన్నారు. కార్యక్రమంలో ఆ శాఖ మండల అధ్యక్షుడు వెంకటేష్, దివ్యాంగులు ఓబన్న, మరిస్వామి, గోవిందరాజు తదితరులు పాల్గొన్నారు.

నాగిరెడ్డిపల్లిలో 'వికసిత్ యాత్ర'

బ్రహ్మసముద్రం: మండలంలోని నాగిరెడ్డిపల్లిలో గురువారం ఎంపీడీఓ దాసానాయక్ అధ్యక్షతన వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో భాగంగా కళా బృందం సంక్షేమ పథకాలపై గేయాలు రూపంలో వివరించింది. కార్యక్రమంలో సర్పంచ్ సందీప్, ఏఓ నందకిశోర్, ఎంఈఓ క్రిష్ణనాయక్ , ఏపీఎం లీలామణి, సూపర్‌వైజర్ రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సర్మస్ హుసేన్సీ దర్గాలో ఫాతేహాలు

బొమ్మనహాళ్: ప్రసిద్ధి చెందిన దర్గాహొన్నూరు సర్మస్ హుసేన్సీ స్వామి దర్గాలో గురువారం భక్తులు దర్గాలో ప్రత్యేక ఫాతేహాలు సమర్పించారు. స్వామి దర్శనార్థం ఆంధ్ర, కర్ణాటక ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. దర్గా పెద్దలు ఉదయం స్వామి సమాధికి గంధం పూసి నూతన వస్త్రాలతో అలంకరించి ప్రత్యేక ఫాతేహాలు, ప్రార్థనలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు దర్గా ఆవరణలో కందూరీలు చేశారు.

నివాళి

విడపనకల్లు: ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి సతీమణి వై.ఉమాదేవి(55) గురువారం అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎంపీపీ కరణం పుష్పావతి, జెడ్పీటీసీ హనుమంతు, పార్టీ మండల కన్వీనర్ బసన్న, వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ నాయకుడు సుంకన్న, మాజీ సర్పంచు కరణం భీంరెడ్డి, మేకల పంపాపతి, సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు సానుభూతి వ్యక్తం చేశారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.